క్లుప్తంగా

నేడు వార్షిక సమావేశం

కూకట్‌పల్లి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పునర్నిర్మాణం, సౌందర్య శస్త్ర చికిత్సల సంఘం 19వ వార్షిక సమావేశం 7, 8 తేదీల్లో కూకట్‌పల్లిలోని ఆకార్ ఆశా హాస్పిటల్‌లో నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేపడతాం



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లోని రోడ్డు నెంబర్2లో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి మురళీ కృష్ణ నిలయం వరకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ లైన్‌లు వేయడంతో రోడ్లు దెబ్బతిన్నాయని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, రామారావు, కొండల్‌రావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ బ్యాంక్ కాలనీలో 1007 సర్వే నెంబర్లో అక్రమంగా నిర్మించిన భారీ షెడ్లను శుక్రవారం జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సరస్వతి శిశుమందిర్‌లో మహిళా సదస్సు

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీలోని సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం సరస్వతి విద్యాపీఠం స్వర్ణోత్సవాల సందర్భంగా మహిళా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పుల్ల సత్యనారాయణ, ధనదుర్గ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. సమాజంలో మహిళల పాత్ర, కుటుంబ వ్యవస్థ, పిల్లలను ఎలా తీర్చిదిద్దాలి, చిన్నప్పటి నుంచి దైవభక్తి, దేశభక్తి పెంచడం, పెద్దల పట్ల గౌరవం వంటి విషయాలపై చర్చించారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



తాగునీటి సరఫరాను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీలో రూ.4 కోట్ల వ్యయంతో 7.5 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందిస్తామన్నారు. హెచ్‌ఎంటీ శాతవాహనకాలనీలో నెలకొన్న సమస్య నేటితో తీరిందన్నారు. సిమెంట్ పైపులైన్‌లను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కొత్త పైపులైన్‌లు వేసినట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రూ.12 కోట్లతో హెచ్‌ఎంటీ శాతవాహన, హెచ్‌ఎంటీ హిల్స్, ఆదిత్యనగర్ కాలనీల్లో కొత్త పైపులైన్‌లు వేసి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నెలకు 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకం ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరేలా చూడాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పవర్ బోర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 18 రిజర్వాయర్ల నిర్మాణం చేశామని, ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో తాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్‌గౌడ్, జలమండలి డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ ప్రశాంతి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఉన్న చేనేత వస్త్రాలు

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని కొలను నారాయణ గార్డెన్ ఫంక్షన్ హాలులో కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్ కొనుగోలుదారులతో సందడిగా మారింది. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత కళాకారులతో తయారు చేసిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వినోద్ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కళాకారులు తయారు చేసిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంక్రాంతి సందర్భంగా పలు ఆఫర్లు ఇస్తున్నట్లు ఆయన వివరించారు. వివిధ రకాల చేనేత బెడ్ షీట్ కవర్లు, కళాకారులు చేతితో తయారు చేసిన బొమ్మలు, వస్తువులు అందుబాటులో ఉన్నాయని, ఈ ప్రదర్శన సంక్రాంతి వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు



బాలానగర్: బాలానగర్ డివిజన్‌లో ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అనేకమార్లు స్థానికులు ఇనుప స్తంభాలతో షాక్ కొడుతుందని తన దృష్టికి తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఈ సమస్యను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో చర్చించి శుక్రవారం సిమెంట్ స్తంభాలను అమర్చే పనులను ప్రారంభించినట్లు తెలిపారు.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటండి



సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ మమత, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో శుక్రవారం ఉప కమిషనర్లు, అధికారులతో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి.మమత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో ప్లాంటేషన్‌పై ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. కాలనీ ప్లాంటేషన్, నిర్వహణను సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులకు కేటాయించినట్లు తెలిపారు. గ్రూపు సభ్యులకు వారు పూర్తి చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులు పూర్తి చేసి జోన్‌లోని పార్కుల్లో మొక్కలు నాటాలని సూచించారు. కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. మ్యుటేషన్, అసైన్‌మెంట్ ఫైల్స్ నిర్దేశించిన సమయంలోపు క్లియర్ చేయాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారుల నుంచి పెనాల్టీ వసూలు చేస్తామన్నారు. సమావేశంలో ఉప కమిషనర్లు రవికుమార్, రవీందర్‌కుమార్, మంగతాయారు, నాగమణి, డిప్యూటీ ప్రాజెక్టు అధికారి ప్రభాకర్, ఇంద్రసేన, శ్రీనివాస్, హరిప్రియ, మధుమోహన్, కె.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను శుక్రవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, జగదీశ్వర్, పాపిరెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎలగందుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: యాడ్‌లైఫ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, జీహెచ్‌ఎంసీ సహకారంతో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాలుకు మహిళా గృహ ఉపాధి పేరిట శుక్రవారం 26 కొత్త కుట్టు మెషిన్లను అందజేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. కుట్టు పని వచ్చినవారికి ఉపాధి, కొత్తవారికి శిక్షణ అందించేందుకు ఈ శిబిరాన్ని నడపాలని సూచించారు. కుట్టు మెషిన్లను అందించిన సంస్థ నిర్వాహకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్‌చంద్ర, కాశీనాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, యాడ్ లైఫ్ డైరెక్టర్ డాలీ, డా.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భిక్షపతియాదవ్ జన్మదిన వేడుకలు



భిక్షపతియాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న పాపిరెడ్డినగర్ బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు ఎం.భిక్షపతి యాదవ్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. భిక్షపతియాదవ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎన్నో గొప్ప పనులు చేశారని, ఆ పనులను గుర్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆయన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు భారీ ఎత్తున తరలి వచ్చి భిక్షపతియాదవ్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యుడు బాలుయాదవ్, ప్రధాన కార్యదర్శి గంగుల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, గోపాలరావు, భూపాల్‌రెడ్డి, ఉపేందర్, గోవర్ధన్‌చారి, శ్రీలత, సుకన్య, అరుణ, రేణుక, రమేష్‌యాదవ్, ఇంద్రకుమార్‌రెడ్డి, లోకేష్, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్ కాలనీలో..



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న సీతారామరాజు తదితరులు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకుడు ఎం.భిక్షపతియాదవ్ జన్మదినం పురస్కరించుకొని బీజేపీ నాయకుడు బొల్లెపల్లి సీతారామరాజు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భిక్షపతియాదవ్ చేసిన అభివృద్ధిని గుర్తుచేసుకొని ఆయన జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ భిక్షపతియాదవ్ చేతుల మీదుగా ఏదో రకంగా లబ్ధిపొందినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు జయరాజు, బాలయ్య, ప్రభాకర్, జ్యోతి, స్వప్న, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

లోప్రెషర్ సమస్య పరిష్కరించాలి

మూసాపేట: భరత్‌నగర్‌లో లోప్రెషర్ తాగునీటి సరఫరా కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ సంబంధిత అధికారికి శుక్రవారం వివరించారు. బస్తీ ప్రజలకు సరైన పరిష్కారం చూపాలని, ముందుముందు ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి హరి, జిల్లా కార్యవర్గ సభ్యులు అభిషాల్, వెంకటేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.